# అంకోలి వాగులో.. అక్రమ ఇసుక దందా..



- రెండు ట్రాక్టర్లు సీజ్ చేసిన అధికారులు
- వరద వచ్చినా.. ఆగని అక్రమ రవాణా

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయి.దీంతో జిల్లా అధికారులు,ప్రజా ప్రతినిధులు ముంపు ప్రాంతాలను పర్యటిస్తున్నారు.కాగా ఆదిలాబాద్ రూరల్ మండలంలో మాత్రం అక్రమార్కులు ఇసుకను దర్జాగా తరలిస్తున్నారు.ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి వాగు సమీపంలో అనుమతులు లేకుండా ఇసుకను దాదాపు 20 ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారని మండలవాసులు ఆరోపిస్తున్నారు.భారీ వర్షానికి జిల్లా అతులాకుతులమైతే ఇక్కడ మాత్రం ఇసుక దందా జోరుగా సాగుతోందన్నారు. ఈ విషయమై రూరల్ ఎమ్మార్వో గోవింద్ నాయక్ ను వివరణ కోరగా.. ఇసుక రవాణా జరుపుతున్న ప్రాంతానికి వెళ్ళామని..అక్కడ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎమ్మార్వో తెలిపారు.అదేవిధంగా మిగిలిన ట్రాక్టర్ల నిర్వాహకులు ఇసుకను అక్కడే డంప్ చేసి వెళ్లినట్లు పేర్కొన్నారు.



# వాగులు దాటుతూ.. వంతెనలు ఎక్కుతూ..

**ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పర్యటన..**

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పర్యటించారు.ఆదివారం అంకొలి,తంతోలి,వాన్వాట్, లోకారి గ్రామాల మధ్య వాగులు వంకలు దాటుతూ,నడుమంటి నీటిలో నుంచి వెళ్లి పలు గ్రామాల్లో పరిస్థితిని పరిశీలించారు.అదేవిధంగా వరద ఉద్ధృతికి తెగిన రోడ్డు నుంచి వరదల్లో కొట్టుకొచ్చిన కట్టెలు,తాడు సహాయంతో ఎమ్మెల్యే వంతెనను ఎక్కి అక్కడి పరిస్థితిని పరిశీలించారు.ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు బంతిపెల్లి దయాకర్,కేమ



శ్రీకాంత్,మడావి రాజు,హనుమంతు,సాయి గౌడ్,దౌలత్,ప్రసాద్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు అండగా పిడుగు సంజీవ్ రెడ్డి

- పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ

**శెనార్తి మీడియా, తలమడుగు :**

మండలంలో రెండు రోజులు కురిసిన వర్షానికి ఇండ్లలో నీరు చేరండంతో ఇంట్లో ఉన్న సామాగ్రి అంతా తడిచి ముద్దయ్యాయి. ఆదివారం మండలకేంద్రంలోని చర్చి కాలనీలో 25 కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిడుగు సంజీవ్ రెడ్డి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆసం రవీందర్, నేతుల గంగన్న, కాటిపెల్లి సునీత రెడ్డి, చంద్రకాంత్, శ్రీకాంత్, అడెల్లు పాల్గొన్నారు.







# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ పట్టణంలోని యాదవ సంఘ భవనంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జరిపిన ఉత్సవాల్లో చిన్నారులు శ్రీ కృష్ణ,గోపికల వేషధారణలో అలరించారు.భక్తి పాటలకు అనుగుణంగా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేస్తూ ఆకట్టుకున్నారు.అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేశారు.ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించిన ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఎమ్మెల్యేలు పాయల్ శంకర్,అనిల్ జాదవ్ ఉత్సవాల్లో పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు. అనంతరం చిన్నారులు ఉట్టి కొడుతూ సందడి చేయగా..వారితో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.సంస్కృతి,సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించడం పట్ల అతిథులు అభినందనలు తెలియచేశారు.అనాదిగా వస్తున్న సంస్కృతి,సంప్రదాయాలను విశిష్టతను భావి తరాలకు తెలియచెప్పేలా పండగ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగురామన్న,డీసీసీబీ



చైర్మన్ అడ్డి భోజారెడ్డి,బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్,సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డా.రవికిరణ్ యాదవ్,బీజేపీ కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి,కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,న్యాయవాది శ్రీకాంత్ యాదవ్,జిల్లా యాదవ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అసుర హన్మాండ్లు యాదవ్,మంచాల మల్లయ్య యాదవ్, మంగారపు మహేందర్ యాదవ్,నవీన్ యాదవ్, సుధాకర్ యాదవ్, రవికాంత్ యాదవ్ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు







## రైతులను బేజారు చేస్తున్న లింకు ఎరువుల దందా

- అవసరం లేని ఖర్చులతో రైతులపై భారాలు
- కంపెనీలు, హోల్‌సేల్ వ్యాపారులకు లాభాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా రైతులపై కొత్త రకమైన భారం పడుతోంది. వ్యవసాయానికి అవసరమైన ప్రధాన ఎరువులు (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్) కావాలంటే వాటితో పాటు లింకు ప్రొడక్ట్స్ తప్పనిసరిగా కొనాలని వ్యాపారులు, కంపెనీలు బలవంతం చేస్తున్నారు. దీని వలన రైతులపై ఖర్చు పెరిగిపోతోంది. లింకు వద్దంటే హోల్‌సేల్ వ్యాపారులు ఎక్కువ ధరకు ఎరువులు పంపి, రిటైలర్లు మరింత ధర పెంచి రైతులకు విక్రయిస్తున్నారు. ప్రతి లారీకి ప్రధాన ఎరువులతో పాటు 10–15 శాతం లింకు ఎరువులు తప్పనిసరిగా పంపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

**లింకు పేరుతో వృథా ఖర్చులు**

హోల్‌సేల్ వ్యాపారులు రిటైల్ డీలర్లకు లింకు పెడితే, రైతులకు కూడా అదే విధంగా మోపుతున్నారు. “ఒక సంచి యూరియా కావాలంటే, ఈ బయో ఫర్టిలైజర్ కూడా తీసుకోవాలి... డీఏపీకి తోడు ఈ ప్రొడక్టు తప్పనిసరి” అని షరతులు పెడుతున్నారు. సొసైటీలకు తగినంత ఎరువులు అందకపోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీని వలన లింకు ప్రొడక్ట్స్ వల్లే రైతు ఖర్చు రెండు, మూడు రెట్లు పెరుగుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది. వాటిలో చాలా ప్రొడక్ట్స్ ఎలాంటి ఉపయోగం లేకుండా వృథా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

**వ్యాపారులకు లాభాలు**

లింకు ప్రొడక్ట్స్ పై 40–60 శాతం వరకు లాభం రావడంతో కంపెనీలు, వ్యాపారులు రైతులను వంచిస్తున్నారని సమాచారం. కంపెనీ టార్గెట్లు నెరవేర్చడమే లక్ష్యంగా లింకు ఉత్పత్తులు బలవంతంగా విక్రయిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక ప్రొడక్టుకు మరో ప్రొడక్టు ఉచితం ఇవ్వడం, అధిక కమీషన్లు, విహారయాత్రలు కల్పించడం వంటి కారణాల వల్ల హోల్‌సేల్ వ్యాపారులు కూడా రైతులను లింకు కొనుగోళ్లకు గురి చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం**

రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఎరువుల హోల్‌సేల్ వ్యాపారులపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు. తనిఖీలు చేసినా అవి కేవలం ఫార్మాలిటీగానే ముగుస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇన్ వాయిస్‌లు పరిశీలిస్తే లింకు ప్రొడక్ట్స్ ఎక్కడికి పంపుతున్నారో తేలుతుందని, అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కఠిన చర్యలు అవసరం**

వ్యవసాయాన్ని లాభదాయకం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ లింకు దందా పెద్ద సవాలుగా మారిందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

## బీఆర్ఎస్ నేతలపై తప్పడు కేసులు సరికాదు



- బాధితుల ఫిర్యాదు తీసుకోకుండా దాడి చేసిన వారికే వత్తాసు పలుకుతారా
- మేము మళ్లీ అధికారంలోకి వచ్చాక కేసులు చేయిస్తాం
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

బాధితుల ఫిర్యాదు స్వీకరించకుండా, దాడి చేసిన వారికే వత్తాసు పలుకుతున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ నేతలపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక అలాంటి అధికారులపై కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు. ఆదివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హాజీపూర్ మండలం రాపల్లిలో ఆగస్టు 14న జరిగిన వివాహ వేడుకలో డీజే వద్ద గొడవ జరిగిందని, ఆ గొడవలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆనె ప్రవీణ్, ఆనె నితీష్ పై కాంగ్రెస్ నేత తనిగెళ్ల సాయి దాడి చేశాడ ని చెప్పారు. మరుసటి రోజు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా ఎస్సై స్వీకరించలేదని, అదే రోజు రాత్రి సాయి, సాగర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ప్రవీణ్, నితీష్ తో పాటు గొడవకు సంబంధం లేని మల్లేష్, మం ద పల్లి శ్రీనివాస్ పై కేసు నమోదు చేశారని తెలిపారు. దళితులపై దాడి జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా, కాంగ్రెస్ నేతల మాట విన్న ఎస్సై దాడికి గురైన వారిపైనే కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. అలాంటి అధికారుల పేర్లను నోట్ చేసుకుంటున్నామని, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చాక కేసులు రీ ఓపెన్ చేసి చర్యలు తీసుకుంటామని దివాకర్రావు హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలపై తరచూ తప్పుడు కేసులు పెడుతున్న అంశంపై గతంలోనే పోలీస్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారు లు వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు అంకం నరే ష్, తోట తిరుపతి, రవీందర్ రెడ్డి, తాజోద్దీన్, అత్తి సరోజ పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు..

**కాంగ్రెస్ నేత అల్చెట్టి నాగన్న విస్తృత పర్యటన..**

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి వాగులు,వంకలు పొంగి వరదలు వచ్చాయి.ఇందులో భాగంగానే ఆదిలాబాద్ మండలంలోని ఎస్సీ కాలనీలో భారీ వర్షానికి రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన కాంగ్రెస్ నేత ఆదిలాబాద్ రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న దగ్గరుండి తన జెసిబితో వాటిని తొలగించి వారి ఇబ్బందులు తీర్చారు. దీంతో స్థానికులు కాంగ్రెస్ నేతకు కృతజ్ఞతలు తెలిపారు.


RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644. Web: shenarthimedia.in, Epaper:epaper.shenarthimedia.in